డిగ్రీలోనూ.. వరండా చదువులేనా !

సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గదులు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతుండడంతో వరండాలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. వర్షాలకు శ్లాబు పెచ్చులూడి వర్షానికి తరగతులు ఉరుస్తున్నాయి. బెంచీలున్నా నిరుపయోగంగా ఉండడంతో నేలపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు అవస్థల నడుమ చదువులు సాగిస్తున్నారు.

- శిథిల భవనంలో విద్యార్థుల అవస్థలు
- ల్యాబ్ పరికరాల భద్రతకూ ఇబ్బందులే
- క్రీడా మైదానం లేని కళాశాల
- సమస్యల వలయంలో చదువులు


నేలపై పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

సత్యవేడు: సత్యవేడు ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కలను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పల్లెబాట కార్యక్రమంలో అప్పటి ఎమ్మెల్యే నారాయణస్వామి కోరిక మేరకు డిగ్రీ కళాశాల మంజూరు చేశారు. అయితే ఇప్పటి వరకు డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు నామమాత్రంగానే ఉండడంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అవస్థల నడుమ చదువులు సాగిస్తున్నారు.

పాత భవనాలకు మరమ్మతులు చేసి..

2008లో డిగ్రీ కళాశాల తాత్కాలికంగా తెలుగు గంగ భవనంలో ప్రారంభించారు. ఏడాది తరువాత స్థలం కేటాయించారు. స్థలం, సొంత భవనాలు వసతి కల్పిస్తామన్నారు. తాత్కాలికంగా రూ.2 లక్షలు కలెక్టర్ నిధులతో తెలుగు గంగ భవనాలను మరమ్మతులు చేసి డిగ్రీ కళాశాలకు అప్పగించారు. గదులు చిన్నవిగా ఉండడంతో విద్యార్థులు ఇరుకు గదుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. ప్రస్తుతం మిద్దె పైన గదులు పూర్తిగా దెబ్బ తిన్నాయి. విద్యార్థులకు ప్రత్యేక లైబ్రరీ వసతికి ఇబ్బందులు పడుతున్నారు.

విద్యార్థులు.. అధ్యాపకులు


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ఎకనామిక్స్ , బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ కెమిస్ట్రీ తరగతులలో 176 మంది విద్యార్థులు ఉన్నారు. పర్మినెంట్ అధ్యాపకులు 06, కాంట్రాక్టు 07, గెస్టు ఫ్యాకల్టీ 02 ఉన్నారు. డిగ్రీ కళాశాలలో సుమారు 10 గదులు ఉన్నప్పటికీ మిద్దెపైన ఉన్న గదుల శ్లాబు పెచ్చులూడి శిథిలావస్థకు చేరింది. కిటికీలు దెబ్బతిన్నాయి. వర్షానికి శ్లాబు ఉరుస్తుండడంతో గదుల్లోని బెంచీలు దెబ్బతిన్నాయి. మిద్దెపై గదుల్లో ఫ్యాన్లు లేవు. దీంతో కింద రూములు, వరండాల్లోనే చదువులు నిర్వహిస్తున్నారు.

ఆటలు ఆడేందుకు వీలు లేక..

డిగ్రీ కళాశాలలో క్రీడా మైదానం లేకపోవడంతో విద్యార్థులకు క్రీడా ప్రోత్సాహం కొరవడింది. తరగతులు ముగిసిన వెంటనే విద్యార్థులు ఇళ్లకు పోతున్నారు. కనీసం తాత్కాలికంగా అయినా మైదానం సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.


సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం


తరగతి గదిలో ఇలా..


పెచ్చులూడి పడుతున్న తరగతి గది శ్లాబు

దాతల సాయంతో..

కళాశాలలో విద్యార్థులకు మరుగుదొడ్డి సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులు (బాలురు)కళాశాలకు దూరంగా ఉన్న జీడిమామిడితోపునకు వెళుతున్నారు. బాలికలకు గంగ కార్యాలయం మరుగుదొడ్డి దెబ్బతినడంతో దాతలు రెండు మరుగుదొడ్లు నిర్మించి ఇవ్వడంతో బాలికలకు కొంత మేరకు ఇబ్బందులు తప్పాయి. –ఎస్‌.ఏ.నవీన్, బీకాం, సత్యవేడు

కళాశాలకు స్థలం కేటాయించాలి

డిగ్రీ కళాశాలకు 7.03 ఎకరాలు ప్రభుత్వం కేటాయించింది. గత ఏడాది జగనన్న కాలనీ ఏర్పాటుకు ఆ స్థలాన్ని ఇచ్చేశారు. నేడు కళాశాలకు స్థలం లేదు. ప్రభుత్వం డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలి. – పార్థసారథి, బీకాం, తృతీయ సంవత్సరం, సత్యవేడు

దాతలు ఉన్నా స్థలం లేదు

శ్రీసిటీలోని కొన్ని కంపెనీలు డిగ్రీ కళాశాలకు గదులు నిర్మించేందుకు ముందుకు వస్తున్నాయి. ఉన్న స్థలం జగనన్న కాలనీకి కేటాయించి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. కళాశాలకు ప్రజాప్రతినిధులు స్థలం కేటాయించి, డిగ్రీ కళాశాలకు నూతన భవనం నిర్మించాలి. –చలపతి, బీకాం తృతీయ సంవత్సరం, సత్యవేడు

క్లుప్తంగా

సామూహిక కావళ్లు


కావళ్లు మోసుకెళుతున్న భక్తులు

ఏర్పేడు: మండలంలోని ఆమందూరు పంచాయతీ బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన భక్తులు శనివారం సామూహికంగా కావడి ఉత్సవం చేపట్టారు. ఆడిమాసంతో బాలకృష్ణాపురానికి చెందిన భక్తులు సామూహికంగా కావళ్లు మోసుకుంటూ ఊరేగింపుగా తిరుత్తణి క్షేత్రానికి వెళుతున్నారు. శనివారం గ్రామస్తులు గ్రామదేవతలకు మొక్కులు చెల్లించి తిరుత్తణికి బయల్దేరి వెళ్లారు.

గిరిజనులను దగా చేసిన చంద్రబాబు

రేణిగుంట: ఎన్నికల ముందు గిరిజన జాబితాలోకి ఇతర కులాలను చేర్చకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే చట్టం తెస్తానని సీఎం చంద్రబాబు గిరిజనులను మోసం చేశారని గిరిజన సంఘం నాయకులు అన్నారు. అంతర్జాతీయ ఆదివాసి గిరిజన దినోత్సవం పురస్కరించుకొని గిరిజన సంఘం మండల కమిటీ సమావేశాన్ని శనివారం పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో మూడు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. బీసీ–ఏ కులానికి చెందిన బోయ లను ఇతర కులాలను గిరిజన తెగ (ఎస్టీ) జాబితాలోకి చేర్చాలని ఆమోదించిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి ఈశ్వరమ్మ, చిట్టేటి ప్రసాద్, రొద్దా మునస్వామి,గోళ్ళ వెంకటరమణ,కె. రాముడు, రత్నమ్మ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం


ప్రత్యేక అలంకరణలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి చక్రస్నానం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం తొండమానుపురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా పవిత్రోత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా చివరి రోజు శనివారం స్వామి వారికి అత్యంత వేడుకగా చక్రస్నానం జరిగింది. రాత్రి స్వామి అమ్మవార్లు బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

నివాళి


మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

నాగలాపురం: మండలంలోని తూర్పు హరిజనవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చార్లీస్ తల్లి రోజా(65) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతిచెందారు. సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి రోజా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు పార్టీ సీనియర్ నేతలు అపరంజిరాజు, సర్పంచ్ చిన్నదొరై , హరిబాబు, కులశేఖర్ రెడ్డి, రాజామని, హరిచంద్రారెడ్డి, జేమ్స్, దేశప్పన్, సుకుమార్, అలగేశన్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ


ఆడికృత్తిక పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నాగలాపురం: పిచ్చాటూరు మండలం రామగిరిలోని శ్రీ ముత్తు కుమార స్వామి ఆలయంలో ఈనెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఆడికృత్తిక మహోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన గోడపత్రికలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో నాయకులతో కలిసి ఆవిష్కరించారు. 15వ తేదీ భరణి, 16వ తేదీ ఆడికృత్తిక, 17వ తేదీ రోహిణీ తెప్పోత్సవాలు జరుగనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ

రేణిగుంట: మండలంలోని జీపాలెం పంచాయతీ, పద్మానగర్‌లోని 25 మంది మహిళలకు యుఎస్ఏ ఏకం వారి ఆర్థిక సహకారంతో సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 3 నెలలు పాటు టైలరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం యుఎస్ఏ ఏకం వాలంటీర్లు శ్రీలోచన, విభూవర్ధన్, చిన్నారి దివిజ చేతుల మీదుగా ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిర్డ్స్ సంస్థ కో ఆర్డినేటర్ తేజోవతి, హరిబాబు, శిక్షకురాలు మంజుల పాల్గొన్నారు.

ఘనంగా గోపూజ


నూతన గంగమ్మ ఆలయం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరులో గ్రామస్తులు నిర్మించిన గంగమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా శనివారం గోపూజ నిర్వహించారు. నూతనంగా ప్రతిష్ఠించనున్న విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం విగ్రహాలకు పూజలు చేసి, అభిషేకాలు చేశారు. గోపూజ, గణపతి, యంత్ర ప్రతిష్ట, అర్చన, యాగశాల పూజలు, మూలమంత్ర హోమములు, ప్రతిష్ట, అర్చన, నివేదన ఘనంగా జరిగాయి. ఆదివారం యాగశాల పూజలు, ప్రాణప్రతిష్ట, తదితర కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శనివారం రక్షాబంధన్ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అక్కా, చెల్లెలు అన్నదమ్ములకు రాఖీలు కట్టి వారి ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం స్వీట్స్‌ను పంచుకున్నారు. అన్నదమ్ములు నిండు నూరేళ్లు జీవించి, తమకు రక్షగా నిలవాలని ప్రార్థించారు.

వేడుకగా రథోత్సవం


యాళీ వాహనంపై ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో వెలసిన ద్రౌపదీదేవి సమేత ధర్మరాజ స్వామి ఆలయ 155వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తులు రథంపై పుర వీధుల్లో ఊరేగారు. మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ ఊరేగించారు. అంతకు ముందు ఉదయం హంస, యాళీ వాహనాలపై స్వామి, అమ్మవార్లు ఊరేగారు. సాయంత్రం అలుగు ఉత్సవం జరిగింది. ఉత్సవాల సందర్భంగా భాగవతారనిచే హరికథా కాలక్షేపం నిర్వహించారు.

- **అగ్నిగుండ మహోత్సవానికి ఏర్పాట్లు:** ఆదివారం జరిగే అగ్నిగుండ మహోత్సవానికి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం సాయంత్రం ఆలయంలో ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించి ఉత్సవ నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో క్రిష్టప్ప మొదలి, రవికుమార్, అర్జున్‌బాబు, సుబ్రమణ్యం, దొరకృష్ణ పాల్గొన్నారు.

గరుడ సేవలో శ్రీకృష్ణుడు

నారాయణవనం: స్థానిక ధర్మరాజుల ఆలయ మహాభారత ఉత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం గరుడు వాహనాన్ని అధిరోహించిన శ్రీకృష్ణుడు నారాయణవనం గ్రామ వీధుల్లో విహరించారు. ఉదయం సారకాల స్వామి ఆలయం నుంచి అలుగుకుండను పుష్పాలతో సుందరంగా అలంకరించి ఊరేగింపుగా ధర్మరాజుల ఆలయానికి తీసుకొచ్చారు. ఎలాంటి ఆధారం లేకుండా కుండలో కత్తిని నిలిపి ప్రత్యేక పూజలను చేపట్టారు. స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో రాత్రి గరుడ సేవను వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలలో చివరి రోజైన ఆదివారం సాయంత్రం భక్తులు అగ్నిగుండ ప్రవేశానికి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త దేశప్ప రెడ్డి తెలిపారు.

ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


ఆలయం వద్ద జస్టిస్ తుహిస్ కుమార్


ఆలయం వద్ద శ్రీనివాసరావు

శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహిస్ కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎస్ఎస్ఏ డైరెక్టర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. దక్షిణగోపురం వద్ద ఆలయ అధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ముందుగా రుద్రాభిషేకం పూజల్లో పాల్గొని అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.




రేణిగుంట ఫ్లైఓవర్ ముందు ఏర్పాటు చేసిన స్వాగత ఆర్చ్, నడివీధి గంగమ్మ వద్ద అమ్మవారి ఆర్చ్

జాతర ఏర్పాట్లు

రేణిగుంట: ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గంగమ్మ జాతర మహోత్సవాలు 11, 12, 13 తేదీల్లో నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడలిలో ఆర్చీలు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారుల్లో విద్యుత్ దీపాలంకరణ చేసి వివిధ దేవతల ప్రతిమల ఆర్చ్‌లను ఏర్పాటు చేశారు. గంగమ్మ ఆలయం వద్ద ముందస్తు ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త సోల మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

అసంపూర్తిగా రాజుల కండ్రిగ విలేజ్ హెల్త్ క్లినిక్


నాగలాపురం : రాజులకండ్రిగలో నిర్మాణ దశలో ఆగిపోయిన భవనం

వరదయ్యపాళెం: నియోజకవర్గంలోని నాగలాపురం మండల పరిధిలోని రాజులకండ్రిగ సచివాలయం పరిధిలో నిర్మాణ దశలో ఆగిపోయిన విలేజ్ హెల్త్ క్లినిక్ పనులు పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. గత ప్రభుత్వంలో రూ. 23 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే శ్లాబు దశ వరకు పనులు జరగడంతో సార్వత్రిక ఎన్నికలు సమీపించిన కారణంగా సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులను అర్ధాంతరంగా ఆపివేయడం జరిగింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు పూర్తవుతున్నా పనులను పూర్తి చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. నిర్మాణ పనులు పూర్తి చేసి వైద్యసేవలను స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

భయం గుప్పెట్లో తహసీల్దార్ కార్యాలయం




కంప్యూటర్లపై కప్పిన ప్లాస్టిక్ కవర్లు, అర్ధాంతరంగా ఆగిన తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణం




శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయ భవనం, పెచ్చులూడిన భవనం పైకప్పు

ఏర్పేడు: ఏర్పేడు తహసీల్దార్ కార్యాలయం చిన్నపాటి చినుకులకే ఉరుస్తోంది. దశాబ్దాల కాలం నాటి భవనం కావడంతో ఏళ్ల తరబడి శిథిలావస్థకు చేరింది. దీంతో కార్యాలయం మొత్తం పైకప్పు ఉరుస్తోంది. దీంతో కార్యాలయంలో భద్రపరిచిన విలువైన భూ రికార్డులు తడవకుండా కాపాడుకోవడం కార్యాలయ సిబ్బందికి సవాలుగా మారింది. తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో శాశ్వత భవన నిర్మాణ పనులు 8 ఏళ్ల కిందట చేపట్టినా.. నిధుల లేమితో భవన నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. దీంతో శిథిలావస్థకు చేరిన భవనం ఎప్పుడు కూలుతుందోనన్న భయాందోళనతో కార్యాలయ సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే చాలు... పైకప్పు నుంచి వర్షపునీరు ధారలా కారుతూ కార్యాలయంలో విలువైన రికార్డులు, కంప్యూటర్లను తడుపుతున్నాయి. రికార్డుల గది కూడా ఉరుస్తుండటంతో విలువైన రికార్డులు ఎక్కడ తడిచిపోయి పాడవుతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఏఎస్‌వో గదిలో కంప్యూటర్లపై కూడా చినుకులు పడుతుండటంతో వాటిపై ప్లాస్టిక్ కవర్లు కప్పి కాపాడుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రావణ పౌర్ణమి వేడుకలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బీపీ అగ్రహారంలో వెలసిన పెద్ద గంగమ్మ ఆలయంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష పూజల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గోపూజ చేశారు. మహిళా భక్తులకు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన వరలక్ష్మి వ్రతంలో ఉంచిన దారాలు, పంచముఖ రుద్రాక్షలు భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మల్లెంబాకం మునికృష్ణారెడ్డి, మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, ఆరణి మురళీకృష్ణారెడ్డి, బాలకృష్ణ, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

చాముండేశ్వరీదేవికి..

సత్యవేడు: మండల కేంద్రంలోని దేవాంగ కులస్తులు శ్రావణ పౌర్ణమి సందర్భంగా చాముండేశ్వరి దేవిని కొలువు ఉంచి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహం అనంతరం దేవాంగులు పాత గాయత్రీలు విడిచి కొత్తగా గాయత్రీలు ధరించారు.

నారాయణవనంలో..

నారాయణవనం: మండలంలోని ఆలయాలల్లో శనివారం శ్రావణ పౌర్ణమి పూజలను నిర్వహించారు. శింగిరికోనలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో లక్ష్మీనరసింహస్వామికి అభిషేకాలు, ధన్వంతరి, లక్ష్మీ హోమాలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామికి కల్యాణాన్ని నిర్వహించారు. ట్రస్టీ సభ్యులు గిరిబాబు, భాస్కర్ మాట్లాడుతూ.. ఆలయాన్ని దర్శించుకునే భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సొరకాయలస్వామి , కైలాసనాథ కోన, రామాలయంలో పౌర్ణమి పూజలను నిర్వహించి, అన్నప్రసాదాలను వితరణ చేశారు. పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రమైన శ్రవణం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేతుడైన కల్యాణ వేంకటేశ్వరస్వామి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.






సత్యవేడు: చాముండేశ్వరీ దేవి అలంకరణ, ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి, శ్రీదేవీ, భూదేవీ సమేత లక్ష్మీనరసింహస్వామి


భక్తులకు పసుపు దారాలు, రుద్రాక్షలు అందజేస్తున్న దృశ్యం